బతుకమ్మకుంట విషయంలో మీడియాకు తప్పుడు సమాచారం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి



రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంట విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీడియాకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రజలను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆరోపించారు. నిజాయితీపరుడినని చెప్పుకునే రంగనాథ్, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో మాజీ ఎంపీ కబ్జాచేసిన భాగ్యలక్ష్మి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన పార్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. గురువారం అంబర్‌పేట ఛేనెంబర్ చౌరస్తాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ కుంట అనేది లేనేలేదని, సర్వే నెంబర్ 563/1 డ్రై, వేకెంట్‌ల్యాండ్ అని పేర్కొన్నారు. గత యేడాది నవంబర్ 13న తనను పోలీసులతో గృహ నిర్బంధం చేసి హైడ్రా బతుకమ్మకుంటలోకి వెళ్లిందన్నారు. కుంటల పేర్లతో ఉన్న మాసబ్ ట్యాంక్, నల్లకుంట, నాగమయ్యకుంట తదితర ప్రాంతాల్లో కూడా హైడ్రా తవ్వకాలను జరపాలని ఆయన డిమాండ్ చేశారు. వేకేషన్‌కోర్టు బతుకమ్మకుంటపై స్టేటస్ కో ఇచ్చిందని, అయినా ఆ ఆర్డర్‌ను ఉల్లంఘించి హైడ్రా పనులు చేస్తోందని ఆరోపించారు. బతుకమ్మకుంట 18 ఎకరాలలో బాగ్‌అంబర్‌పేట హౌసింగ్ సొసైటీ, తులసీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కూడా 40 శాతం ఓపెన్ ల్యాండ్ వదలాలని చెప్పినాకూడా వదలలేదన్నారు. ఈ అంశాన్ని కూడా హైడ్రా పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్



ముషీరాబాద్‌లో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ సుప్రియానవీన్ గౌడ్

ముషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, వాసు, లక్ష్మణ్, మహిళా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సంఘం నూతన సంస్థ ఆవిర్భావం

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గిరిజన హక్కుల సంఘం (జీహెచ్‌ఎస్) నూతన సంస్థ గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆవిర్భవించింది. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.నారాయణరావు ముఖ్యఅతిథులుగా హాజరై సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారులు గూగుల్ కిషన్‌నాయక్, దేశభక్త ప్రజాతంత్ర సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, గిరిజన కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బానోతు రామారావు, కో-కన్వీనర్ బాలునాయక్, భూక్య శ్రీనివాస్, సభ్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా : ఎంపీ లక్ష్మణ్

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ డా.కె.లక్ష్మణ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో నల్లపోచమ్మ దేవాలయంలో రేణుకా ఎల్లమ్మ, నలపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గురువారం ధాన్యాధివాసం, ఫలాదివాసం, హోమం, పుష్పాదివాసం, సేయాదివాసం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, నాయకులు ఆనంద్‌రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నర్సింగ్‌రావు, సభ్యులు నర్సింగ్‌ముదిరాజ్, లక్ష్మణ్, జగన్, డి.కుమార్, జీవై.గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా గురువారం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపారాయణ, మండప పునఃపూజలు, అమ్మవారి విగ్రహం ఊరేగింపు, మూల మంత్ర హోమాలు, ఆవాహిత హోమాలు, శ్రీ సూక్త, దుర్గాసూక్త, రుద్రహోమాలు, తదితర కార్యక్రమాలు జరిగాయి. లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ, ఉద్యోగసంఘం నాయకులు బొల్లం మహేందర్, అవినాశ్‌రావు, వెంకటేశ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, చంద్రకళ, సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదమ్మ, విశ్రాంత ఉద్యోగులు చంద్రయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శిగా ఆనంద్‌రావు

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గాంధీనగర్ డివిజన్ ప్రధానకార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు వడ్డపల్లి ఆనంద్‌రావు నియమితులయ్యారు. డివిజన్ పార్టీలో బూత్ అధ్యక్షుడి మొదలుకొని బీజేవైఎం డివిజన్ ఉపాధ్యక్షుడిగా, ముషీరాబాద్ అసెంబ్లీ కోకన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు ప్రస్తుతం బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ఆయన గురువారం సాయంత్రం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ డా. లక్ష్మణ్, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి

బర్కత్‌పుర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో సీసీరోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. గురువారం జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్‌తో కలిసి చప్పల్ బజార్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలం సందర్భంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు నరేష్, భీమ్‌రాజ్, వాసు, సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూబీ స్టీవెన్సన్‌కు తెలంగాణ ఐకాన్ అవార్డు



రూబీ స్టీవెన్సన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అంబర్‌పేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, అంబర్‌పేటకు చెందిన రూబీ స్టీవెన్సన్‌కు తెలంగాణ ఐకాన్ అవార్డు లభించింది. సావిత్రీబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సిటీ కల్చర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినందుకు ఆయనకు తెలంగాణ ఐకాన్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ, పిండిగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై గ్లోబ్‌ను ఎగుర వేస్తున్న పర్యావరణవేత్తలు, హెచ్‌సీఎఫ్ ప్రతినిధులు



గ్లోబల్ వార్మింగ్‌పై అవగాహన ర్యాలీలో మాజీ ఎంపీ అజీజ్‌పాషా

పర్యావరణాన్ని రక్షిద్దాం



సుందరయ్య పార్కులో మొక్కను నాటుతున్న ప్రజాకవి జయరాజు

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ ఆలిండియా ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అటవీ, జీవవైవిధ్య, విస్తృత పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరమని, భయంకరమైన అటవీ నిర్మూల కార్యకలాపాలను ఆపాలని, క్షీణించిన అడవులను పునరుద్ధరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా అన్నారు. 'పచ్చదనం బతికిద్దాం. ప్రాణవాయువును కాపాడుకుందాం. ప్రకృతి పచ్చగా ప్రశాంతంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యం' అని ప్రజాకవి జయరాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు, యువత కృషి చేయాలని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రీ పిలుపిచ్చారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం(హెచ్‌సీఎఫ్) ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్కను నాటడంతో పాటు వాటి పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్ ప్రజలను కోరారు. పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు, పర్యావరణ ప్రేమికుడు చిక్కా దేవదాసు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం : సీపీఐ

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అటవీ, జీవవైవిధ్య, విస్తృత పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా పేర్కొన్నారు. భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం, ఆలిండియా తంజీమ్ - ఏ -ఇన్సాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేఖల గోపాల్, కడారి ప్రభాకర్, ఎ.విజయలక్ష్మి, మునీర్ పటేల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



గగన్‌మహల్‌లో మొక్కను నాటుతున్న ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ ఆలిండియా ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ బీజేపీ నేతలు, యువతకు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కవాడిగూడ డివిజన్‌లోని గగన్‌మహల్‌లోని శివశక్తి ప్యాలెస్ వీధిలో డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీకార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.రమేష్‌రాం, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దాం

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు, పర్యావరణ ప్రేమికుడు చిక్కా దేవదాసు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ జనరల్ స్టోర్స్‌కు వెళ్లినప్పుడు వస్తువులు కొనుగోలు చేసి, వాటిని తమ వెంట తెచ్చుకున్న జూట్‌బ్యాగ్‌లో లేదా బట్ట బ్యాగ్‌లో మాత్రమే తీసుకురావాలన్నారు.

పచ్చదనాన్ని బతికిద్దాం : జయరాజు

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సేవ్ ది నేచర్ సేవ్ ది ఫ్యూచర్, ప్రకృతిని కాపాడుకుంటే మన భవిష్యత్ కాపాడుతుందని ప్రజాకవి జయరాజు పేర్కొన్నారు. ప్రకృతి పచ్చగా ప్రశాంతంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణ సమతుల్యతకు చెట్లు ఆధారభూతంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య పార్కులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఉన్నాడంటే అడవి పచ్చగా కళకళలాడుతుందన్నారు. నేడు ఆదివాసులను అడవి నుంచి తరలించేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఏ.విజయ్‌కుమార్, డీవైఎఫ్‌ఐ కార్యదర్శి జావేద్, నాయకులు రాజయ్య, సైదులు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై హెచ్‌సీఎఫ్ నేతలు, పర్యావరణ ప్రేమికుల మానవహారం

ఇంటికో మొక్క నాటాలి

నల్లకుంట: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ ఇంటికో మొక్కను నాటడంతో పాటు వాటి పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ ప్రజలను కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం నల్లకుంటలోని పలు చోట్ల ఆయన మొక్కలు నాటడంతోపాటు మొక్కలకు నీరు పోశారు.

ట్యాంక్‌బండ్‌పై మానవహారం

కవాడిగూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం(హెచ్‌సీఎఫ్) ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఎదురుగా మానవహారం నిర్వహించారు. ట్యాంక్‌బండ్‌పైన కాలుష్యాన్ని అరికట్టాని, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ పెద్దఎత్తున మానవహారం నిర్మించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్‌గా ఐక్యరాజ్యసమితి ఎన్‌డింగ్స్ గ్లోబల్ ప్లాస్టిక్ పొల్యూషన్ అని పిలుపునిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ పిలుపు మేరకు హెచ్‌సీఎఫ్ కార్యకర్తలు ఏడు అడుగల వ్యాసం గల గ్లోబును నిర్మించి అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు నింపి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ లుబ్నా సర్వత్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్య ప్రమాదం ప్రపంచ మానవాళి మనుగడకే ప్రశ్నార్థకంగా తయారైందని, దీనిని ప్రజలు, ప్రభుత్వాలు గుర్తించి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ జయసూర్య, హెచ్‌సీఎఫ్ ప్రధానకార్యదర్శి కె.వీరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత కృషి చేయాలి : ప్రొ.లింబాద్రీ

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలా విద్యార్థులు, యువత కృషి చేయాలని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రీ సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విద్యా సంస్థలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజల్లో అవగాహనర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మొక్కలు నాటి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు కుమారస్వామి, శ్రీధర్, స్వప్న, శ్రవణ్, ఏవో కిరణ్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు

ఇందిరానగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. డ్రైనేజీ, కలుషిత నీటి నివారణను అరికట్టడంతోపాటు ఆధునిక రోడ్లు వేస్తామన్నారను. గురువారం ఇందిరానగర్‌కు చెందిన శాంతి భారత్ సేవా సమాజ్ కమిటీ, దిశా కమిటీ సభ్యులు నందగిరి నర్సింహ, కేఎల్ సత్యనారాయణ, సంగపాక నర్సింగ్‌రావు, భాస్కర్ ఎమ్మెల్యేను కలిశారు. ఇందిరానగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. 38 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్‌లు అధ్వానంగా మారడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి ఇళ్ల ముందు, స్థానిక అమ్మవారి దేవాలయం ముందు మురుగునీరు ప్రవహిస్తున్నదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, కలుషిత నీటి నివారణకు కొత్త పైప్ లైన్‌లు వేసేందుకు జలమండలి ఎండీతో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తామని తెలిపారు. రోడ్లను ఆధునీకీకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రాజు, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దిశా కమిటీ సభ్యుడు నర్సింహ, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు తదితరులు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- సెల్లార్‌లో పేరుకుపోయిన నీటిని బయటికి పంపడానికి.. మోటార్‌ను ఆన్ చేస్తుండగా ఘటన

కవాడిగూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. దోమలగూడ పీఎస్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడలోని లోయర్ ట్యాంక్ బండ్ రామకృష్ణమఠం ఎదురుగా ఉన్న ఓ కేఫ్ పక్కనే ఉన్న రిలయన్స్ మెన్షన్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన శివరాం(24) అతను అద్దెకు తీసుకున్న స్థలంలో కారును పార్కింగ్ చేశాడు. అనంతరం సెల్లార్‌లో పేరుకుపోయిన నీటిని బయటకు పంపించేందుకు అక్కడే ఉన్న మోటార్‌ను ఆన్‌చేశాడు. దీంతో ఆయనకు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దోమలగూడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కారుయజమాని, అపార్ట్‌మెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. శివరాం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన భవన నిర్మాణదారులపై, కారు యజమానిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

సమాజాన్ని ప్రభావితం చేసేవి పద్యనాటకాలు



నటీనటులను సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పద్యనాటకాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఆరాధన సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ ఆర్గనైజర్ లోకం కృష్ణయ్య అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నాలుగురోజులుగా జరుగుతున్న పద్యనాటకాల ప్రదర్శన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాయకుడు త్రినాథరావు నటీనటులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, బుర్రా మోహనకృష్ణ, నాగేందర్, ఉమర్‌ఖాన్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీ బాలు స్ఫూర్తి పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు బహూకరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి: శ్రుతిలయ ఫౌండేషన్- సీల్‌వెల్ కార్పొరేషన్, గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సినీగేయ రచయిత శ్రీరామ్ తపస్వి(ఎస్‌పీబాలు సినీగేయరత్న), ప్రముఖ గాయకులు వినోద్‌బాబు, చింతలపాటి సురేష్‌లను (ఎస్‌పీ బాలు స్ఫూర్తి) పురస్కారాలు-2025 లతో సత్కరించారు. గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ఎస్‌పీ బాలు, ఎన్‌టీఆర్, కృష్ణ జయంతి వేడుకలు, సీల్‌వెల్ సినీ సుస్వరాలు-75 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీకమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహనరావు, నవరసగాయని ఆమని, రఫీ, కుసుమ భోగరాజు, వీఎల్‌ఎన్ శర్మ, శ్రీమణి పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన టీపీసీసీ నేతలు



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో టీపీసీసీ నాయకులు

నల్లకుంట: ఏఐసీసీ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి గౌరీశంకర్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.అజయ్ కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ అడ్వయిజర్ ఎన్.శ్రీధర్‌రావు మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో బలోపేతం, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాబాహుళ్యంలో తీసుకెళ్లాలని ఆమె సూచించారని తెలిపారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

అంబర్‌పేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈద్గా కమిటీ సభ్యులు మహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా శనివారం ఉదయం 9.30 గంటలకు అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హజ్రత్ మౌలానా హఫీజ్ అలీ సిద్దికి బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. బక్రీద్ ప్రార్థనల్లో అంబర్‌పేట ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జీఎఫ్‌ఎంఏ ముషీరాబాద్ కమిటీ ఎన్నిక

ముషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోనే అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్‌కు గంగపుత్ర ఫిష్ మర్చంట్ అసోసియేషన్(జీఎఫ్‌ఎంఏ) ముషీరాబాద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా బోన్‌మోన్ శ్రీకాంత్, టేకుల మురళీకృష్ణ ఎన్నికయ్యారు. గురువారం ముషీరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసోసియేషన్ కోశాధికారిగా కొండల్‌రావు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, సలహాదారుగా శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని చెప్పారు. తమ కమిటీ పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న మృగశిర కార్తి సందర్భంగా మార్కెట్‌లో కొనుగోలుదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంచినీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల సౌకర్యం తదితర ఏర్పాట్లు పెద్దఎత్తున చేస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి చేపలు దిగుమతి అవుతాయని పేర్కొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 30 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి ఉందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.